సంక్షేమ వారధులు వలంటీర్లు

- నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు
- వలంటీర్లకు సేవా పురస్కారాల ప్రదానం



వి.విజయను సేవా రత్న పురస్కారంతో సత్కరిస్తున్న కె.కె.రాజు, కార్పొరేటర్లు హనోకు, లీలావతి



సేవా మిత్ర పురస్కార గ్రహీతలతో కె.కె.రాజు, కార్పొరేటర్లు కంపా హనోకు, ఆళ్ల లీలావతి

తాటిచెట్లపాలెం: ప్రజలకు ప్రభుత్వానికి మధ్య సంక్షేమ వారధులు వార్డు వలంటీర్లను నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో వీరి పాత్ర కీలకమన్నారు. జీవీఎంసీ ఆధ్వర్యంలో శుక్రవారం వాసుదేవనగర్‌లో 42, 45 వార్డుల పరిధిలోని ఉత్తమ వలంటీర్లకు సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర పురస్కారాలకు ఎంపికైన వలంటీర్లను ముఖ్య అతిథిగా ఆయన ఘనంగా సత్కరించి పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థ అందుబాటులోకి వచ్చిన నాటి నుంచి పేదలకు అన్ని సంక్షేమ పథకాలను అందజేయడంలో వలంటీర్లు ముఖ్య పాత్ర పోషిస్తున్నారని అభినందించారు. కోవిడ్ సమయంలో కూడా సచివాలయం/వలంటీర్ వ్యవస్థ అద్భుత పనితీరు కనబర్చిందన్నారు. ప్రజా సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో 45వ వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకు, 42వ వార్డు కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ వార్డుల అధ్యక్షులు పైడి రమణ, షేక్ జుబేర్, డైరెక్టర్లు రాయుడు శ్రీనివాసరావు, ప్రసాద్, ఏపీడీ శైలజ, పార్టీ నాయకులు హరిపట్నాయక్, ఆళ్ల శ్రీనివాస్, గాలి ప్రసాద్, నాని, సన్నీ, నేపాల్ శ్రీను, రాజు యాదవ్, గణపతి, సీవోలు, ఆర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖలో ఈస్ట్ కోస్ట్ రైల్వే జీఎం పర్యటన



విశాఖ రైల్వే స్టేషన్‌లో జీఎం మనోజ్‌శర్మ, డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి, అధికారులు

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ శుక్రవారం విశాఖలో పర్యటించారు. డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతితో కలిసి విశాఖ రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. వాల్తేర్ డివిజన్ ఉన్నతాధికారులతో ఆయన మాట్లాడి, వివిధ విషయాలపై వారి నుంచి సూచనలు సలహాలు తీసుకున్నారు. స్టేషన్ రీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా జ్ఞానాపురం వైపు జరుగుతున్న పనులను జీఎం పరిశీలించారు. ఈ పనులపై గతిశక్తి ప్రాజెక్టు అధికారులతో కలిసి సమీక్షించారు. సెల్ఫ్ ప్రొపెల్డ్ ఇన్‌స్పెక్షన్ కార్‌లో జీఎం మనోజ్ శర్మ మార్షలింగ్ యార్డ్, కోచింగ్ యార్డ్, గోపాలపట్నం యార్డ్, సింహాచలం నార్త్ యార్డ్ వంటి కీలక ప్రాంతాలను పర్యటించారు. అనంతరం వైజాగ్ స్టీల్ ప్లాంట్ రైల్వే సైడింగ్‌ను పరీక్షించారు. స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్‌తో సమావేశమై పలు మౌలిక వసతుల అభివృద్ధిపై చర్చించారు. అదాని గంగవరం పోర్టు అధికారులతో జీఎం సమావేశమయ్యారు. చివరిగా దువ్వాడ రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న పనులను జీఎం పరిశీలించారు. పర్యటనలో పలువురు ఈస్ట్ కోస్ట్ రైల్వే ప్రధాన కార్యాలయ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పూర్వి రాజక్‌కు కలెక్టర్ అభినందన



సూపర్ టాలెంటెడ్ కిడ్ పూర్వి రాజక్‌ను అభినందిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: విశాఖకు చెందిన పూర్వి రాజక్‌ను ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సూపర్ టాలెంటెడ్ కిడ్–2023గా ప్రకటించింది. దీంతో శుక్రవారం పూర్వి రాజక్ కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునను మర్యాదపూర్వకంగా కలిసింది. కలెక్టర్ పూర్వి రాజక్‌ను అభినందించారు. 12 సంవత్సరాల వయస్సు గల పూర్వి రాజక్ కళ, సాహిత్యం, క్రీడా రంగాల్లో తనదైన ముద్ర వేసింది. ఆమె తన మూడు సంవత్సరాల వయసులో మొదటి అవార్డు గెలుచుకుంది. అనంతరం మల్టీ టాలెంటెడ్ గర్ల్‌గా అనేక అవార్డులు గెలుచుకుంది. స్కూలు, ఇంటర్ స్కూలు, డిస్ట్రిక్ట్, స్టేట్, నేషనల్, ఇంటర్నేషనల్ స్థాయిలో ఆర్ట్, కరాటే, ఎలక్ట్రికల్ రంగాల్లో 300 కంటే ఎక్కువ అవార్డులు, బహుమతులు గెలుచుకుంది. ఈమె పేరును ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్–2022లో నమోదు చేసింది. రచయిత్రి, కళాకారిణి, కవయిత్రి, వక్త, కరాటే నిపుణురాలు, సామాజిక కార్యకర్తగా విజయాలు సాధించి బంగారు పతక విజేతగా నిలిచింది.

క్లుప్తంగా

సమావేశాలకు గైర్హాజరుపై ఆర్జేడీ ఆగ్రహం

విశాఖ విద్య: పదో తరగతి సప్లిమెంటరీ (అడ్వాన్స్‌డ్) పరీక్షలకు సన్నద్ధం చేసేందుకని నిర్వహించే సమావేశాలకు చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికారులు గైర్హాజర్ కావడం తీవ్రంగా పరిగణించాల్సిందేనని విద్యాశాఖ ఆర్జేడీ జ్యోతి కుమారి అన్నారు. శుక్రవారం డీఈవో కార్యాలయంలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులకు జూన్ 2 నుంచి ప్రారంభమయ్యే అడ్వాన్స్‌డ్ పరీక్షలపై సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణలో ఎలా వ్యవహరించాలనే దానిపై చర్చించారు. అయితే కీలకమైన సమావేశానికి పలువురు సీఎస్, డీవోలు గైర్హాజరయ్యారు. పదో తరగతి అడ్వాన్స్‌డ్ పరీక్షలకు జిల్లాలో 5,981 మంది హాజరౌతుండగా, వీరి కోసమని 24 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రతీ కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, ఒక డిపార్ట్‌మెంట్ అధికారిని నియమించారు. శుక్రవారం నాటి సమీక్ష సమావేశానికి సీఎస్‌లు 24 మందికి గాను 18 మంది, డిపార్ట్‌మెంట్ అధికారులు కేవలం 6 గురు మాత్రమే వచ్చారు. దీనిపై ఆర్జేడీ జ్యోతి కుమారి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గైర్హాజరైన వారందరికీ మెమోలను జారీ చేసి, వారి నుంచే వచ్చే సంజాయిషీ వివరాలను కూడా తనకు నివేదించాలన్నారు. డీఈవో జి.లక్ష్మణరావు, పరీక్షల విభాగం జిల్లా అసిస్టెంట్ కమిషనర్ మురళీ మోహన్, డిప్యూటీ డీఈవో గౌరీ శంకర్ పాల్గొన్నారు.

నేడు సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తామని ఆలయ కార్య నిర్వహణాధికారి బండారు ప్రసాద్ తెలిపారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన ఉంటుంది. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన చేస్తారు.

వేద విద్యార్థులకు వస్త్రదానం



స్వరూపానందేంద్ర స్వామి సమక్షంలో వస్త్రాలు అందిస్తున్న రామదాసు దంపతులు

మద్రిపాలెం: పెందుర్తి శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి ఆశీస్సులతో మురళీనగర్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కిరసాని రామదాసు, లక్ష్మీబాయి దంపతులు శుక్రవారం శారదా పీఠంలో కొలువైన శంకరాచార్యులు స్వామికి వెండి పాదుకలను బహూకరించారు. వారి వివాహ వార్షికోత్సవం సందర్భంగా అక్కడి వేద విద్యార్థులకు స్వామీజీ చేతుల మీదుగా వస్త్రదానం చేశారు. స్వామివారి ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్, సింహాద్రి అప్పన్న ప్రచార సమైక్య వ్యవస్థాపకుడు సనపల నారాయణ, జి.వి.రమణ, ఎస్.రవీంద్రకుమార్ పాల్గొన్నారు.

అలరించిన కర్ణాటక గాత్ర కచేరి



కీర్తనలు ఆలపిస్తున్న గాయని భావన

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన కర్ణాటక గాత్ర కచేరి అలరించింది. గుమ్ములూరి శారద సుబ్రహ్మణ్యం శిష్యురాలు భావనా యదవిల్లి తన అద్భుత గానంతో ముత్తుస్వామి, రామదాస, అన్నమాచార్య, త్యాగరాజ కీర్తనలు ఆలపించి భక్తులను ఆకట్టుకున్నారు. శ్రీ సకల గణాధిక పాలయమాం, ఎవరు రా, నను బ్రోవమని, కంటి శుక్రవారం, శ్రీ చక్ర రాజ సింహాసనేశ్వరి, తాయ రాగమాలికా ధిల్లానా, కనకధారా స్తోత్రం ఆలపించారు. ఈమెకు కోట గాయత్రి వరేణ్య వయొలిన్‌పై, చైతన్య తాలాడ మృదంగంపై వాద్య సహకారం అందించారు. లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ గాయని భావనను సత్కరించారు.

46వ వార్డులో అభివృద్ధి పనులు



సంజీవయ్య కాలనీలో భూమిపూజ చేస్తున్న కె.కె.రాజు, కటుమూరి సతీష్

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డు సంజీవయ్య కాలనీ, సంతోష్‌నగర్ కొండవాలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు శుక్రవారం నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ కలిసి శంకుస్థాపన చేశారు. సుమారు రూ.1.10 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు జోన్–5 ఈఈ శ్రీనివాస్‌రావు తెలిపారు. కమ్యూనిటీ హాల్ మరమ్మతులు, రోడ్లు, డ్రైనేజీలు, కొండవాలులో మెట్ల మార్గాల నిర్మాణాలకు నిధులు మంజూరు కావడంతో పనులు ప్రారంభించినట్లు కె.కె.రాజు చెప్పారు. కార్యక్రమంలో డీఈ భరణికుమార్, ఏఈ అర్చన, వర్క్ ఇన్‌స్పెక్టర్ జగరపు నరేష్, పార్టీ నాయకులు ఎస్.అప్పారావు, బలిరెడ్డి గోవింద్, వై.వి.రాజు, రాఘవులు, గురువోజీ, సంతోష్, మధు, నర్సింగరావు, శ్రీను, కె.రామారావు, ఈశ్వరరావు, గ్రామ పెద్దలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

శ్రీనివాసనగర్ గెడ్డపై బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన



పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ఉషశ్రీ

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డు శ్రీనివాసనగర్ గెడ్డపై ఉన్న బ్రిడ్జి విస్తరణ పనులకు శుక్రవారం కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ రూ.33.50 లక్షలతో పాత బ్రిడ్జిని తొలగించి దాని స్థానంలో ఫోర్ వీలర్స్ వాహనాలు రాకపోకలు సాగించేలా కొత్తది నిర్మిస్తున్నామని తెలిపారు. 6 మీటర్ల వెడల్పు, 10 మీటర్ల నిడివితో బాక్సు కల్వర్టు నిర్మిస్తామన్నారు. బ్రిడ్జి నిర్మాణం నాలుగు నెలల్లో పూర్తి చేయాల్సి ఉందన్నారు. శ్రీనివాసనగర్, నందగిరినగర్, జగన్నాథపురం ప్రాంతాలకు అత్యవసర సమయాల్లో అంబులెన్స్ రాని పరిస్థితి ఉందని, బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే 80 ఫీట్ రోడ్ నుంచి శ్రీనివాసనగర్, నందగిరినగర్‌కు వాహనాలు రాకపోకలకు మార్గం సుగమం అవుతుందన్నారు. చిరకాలంగా ఉన్న సమస్యకు పరిష్కారం చూపడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఈ రవణమ్మ, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్, స్థానిక నాయకులు శ్యామ్, వెంకట్ బైరా, సూర్యకుమారి, భానుమూర్తి, పార్టీ కార్యకర్తలు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి



క్లోక్ రూం సమీపంలో వ్యక్తి మృతదేహం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం నంబర్ 8లోని క్లోక్ రూం సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మరణించాడు. జీఆర్పీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్‌ఐ వి.బాలాజీరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆయన తెలిపిన వివరాలిలా.. ప్లాట్‌ఫాం నంబర్ 8 చివరలో సుమారు 45 ఏళ్ల వయసు గల వ్యక్తి శుక్రవారం మృతి చెంది ఉన్నాడు. ఇతడి వద్ద ఏవిధమైన ఆధారాలు లేవు. ఈ వ్యక్తి గ్రీన్ కలర్ హాఫ్ హ్యాండ్స్ చొక్కా, బ్రౌన్ కలర్ నిక్కర్ ధరించి ఉన్నాడు. మృతుడి గురించి వివరాలు తెలిసిన వారు విశాఖ రైల్వే స్టేషన్‌లోని జీఆర్పీ వద్ద స్వయంగా గానీ లేదా 96661 22722, 94406 27547 నంబర్లలో తెలియజేయాలని ఎస్‌ఐ బాలాజీరావు కోరారు.

జోరుగా ఆలయ ఆధునికీకరణ



పనులు పరిశీలిస్తున్న దాతలు, కార్పొరేటర్ గోవింద్

సీతంపేట: సీతంపేట గ్రామ దేవత కనకమాంబ అమ్మవారి ఆలయ ఆధునికీకరణ పనులు జోరుగా సాగుతున్నాయి. వచ్చే నెల అమ్మవారి పండగ నేపథ్యంలో శ్రీకృష్ణ యువజన సేవా సంఘం పాలకవర్గం, గ్రామ పెద్దలు ఆలయాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. దాతల సహకారంతో సుమారు రూ.20 లక్షలతో ఆలయంలో గ్రానైట్ ఫ్లోరింగ్, వాల్స్, స్టీల్ గ్రిల్స్, పెయింటింగ్ పనులు చేపడుతున్నారు. దాతలు నితీష్‌జైన్, వినీత్ జైన్, 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, సారిపిల్లి పోతురాజు శుక్రవారం పనులను పరిశీలించారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి సారిపిల్లి గంగరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్ సారిపిల్లి సంతోష్, కోశాధికారి బోర వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీసీపీ–1 పద్మజ

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన స్పందనలో అనధికార, అక్రమ నిర్మాణాలపైనే ఫిర్యాదులు అందాయి. స్పందన ద్వారా వచ్చిన ఫిర్యాదులపై సత్వర చర్యలు చేపట్టాలని పట్టణ ప్రణాళికా అధికారులను ఆదేశించినట్టు కమిషనర్ సాయికాంత్ వర్మ తెలిపారు. జీవీఎంసీ పరిధి 8 జోన్లలో ఎటువంటి అనధికార నిర్మాణాలు చేపట్టినా, నిబంధనలు ఉల్లంఘించి భవనాలు నిర్మించినా, భవన నిర్మాణ వ్యర్థాలు, టౌన్‌ప్లానింగ్ విభాగంపై ఎటువంటి ఫిర్యాదు చేయాలన్నా టోల్ ఫ్రీ నంబరు 1800 4250 0009కు ఫోన్ చేసి నేరుగా సమస్య తెలపవచ్చు. లేదా జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫోన్ నంబరు 8187897569కు తెలిపి పూర్తి వివరాలు (డోరు నంబరు, వార్డు నంబరు, చిరునామా, సమస్య వివరాలు) వాట్సప్‌కు పంపితే సంబంధిత జోన్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ ద్వారాపై అధికారులకు నివేదించి, ఆ సమస్య సత్వర చర్యలు చేపట్టనున్నట్టు ప్రధాన సిటీ ప్లానర్ బి. సురేష్ కుమార్ తెలిపారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం టౌన్‌ప్లానింగ్‌పై స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందనలో జోన్–2 నుంచి ఒకటి, జోన్–3 నుంచి రెండు, జోన్–4 నుంచి ఒకటి, జోన్–5 నుంచి రెండు, జోన్–6 నుంచి ఒకటి, జోన్–7 నుంచి ఒకటి, జోన్–8 నుంచి ఒక ఫిర్యాదు వచ్చింది. సిటీ ప్లానర్ సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో డీసీపీ–1 కె. పద్మజ స్పందన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన సిటీ ప్లానర్ మాట్లాడుతూ టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించి ఎటువంటి ఫిర్యాదు చేయాలన్నా టోల్ ఫ్రీ నంబరుతో పాటు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాట్సప్ నంబరుకు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో డీసీపీలు, ఏసీపీలు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, డబ్ల్యూపీఆర్‌ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం రేపు

మురళీనగర్: అపోలో ఆస్పత్రి నేతృత్వంలో మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వాకర్స్ పార్కు ప్రాంగణంలో ఈ నెల 28న ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు క్లబ్ కార్యవర్గ నిర్వాహక కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 6.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఈ శిబిరం జరుగుతుందన్నారు. క్యాన్సర్, సాధారణ వ్యాధులకు సంబంధించి ఉచితంగా పరీక్షలు చేస్తారని చెప్పారు. ఈ వైద్య శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ధనలక్ష్మీదేవి, దుర్గమాంబలకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో దుర్గమాంబ



ధనలక్ష్మీదేవికి హారతి సమర్పిస్తున్న అర్చకుడు

కంచరపాలెం: గొల్లకంచరపాలెంలోని ధనలక్ష్మీదేవి ఆలయం, దుర్గానగర్‌లోని దుర్గమాంబ అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరామా సేవా సమాజం (యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో ధనలక్ష్మీదేవికి ఆలయ ప్రధాన అర్చకుడు శ్యామాచార్యులు, దుర్గమాంబకు ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యశర్మ కుంకుమ పూజలు, పూల, పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం హారత సమర్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయాల కమిటీల సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మృతుడి కుటుంబానికి సాయం

సీతంపేట: జీవీఎంసీ 44వ వార్డు 244 సచివాలయం పరిధి శ్రీనివాసనగర్‌లో నివసిస్తున్న బమ్మిడి వినోద్‌కుమార్ ఈ నెల 19న మృతి చెందాడు. వైఎస్సార్ బీమా పథకం తక్షణ సాయంగా శుక్రవారం అతడి భార్య రాధకు రూ.10 వేలు అందజేశారు. మృతుడి పిల్లల చదువు నిమిత్తం వైఎస్సార్‌సీపీ నాయకుడు బాణాల తరుణ్‌కుమార్ రూ.3 వేల తన సొంత నిధులు అందించారు. కార్యక్రమంలో సచివాలయ అడ్మిన్ సంధ్య, సెక్రటరీ రాము, వలంటీర్ ధన, గోపి పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



రంగులద్దిన సీడీలను చూపుతున్న చిన్నారులు

మురళీనగర్: స్థానిక మహిళలు, పిల్లల శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శుక్రవారం విద్యార్థులకు జనరల్ నాలెడ్జిపై క్విజ్ పోటీలు నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన 25 మంది పిల్లలను గ్రూపులుగా విభజించి పోటీలు జరిపారు. లైబ్రేరియన్ వై.పద్మజ పర్యవేక్షణలో బి.రఘు క్విజ్ మాస్టర్‌గా వ్యవహరించారు. సైన్స్ అండ్ టెక్నాలజీ, కరెంట్ అఫైర్స్, సోషల్, తెలుగు సబ్జెక్టుల్లో ప్రశ్నలు అడిగారు. అనంతరం పిల్లలకు కంప్యూటర్ సీడీలపై ఆర్కిలిక్ కలర్స్‌తో చిత్రాలను వేసే విధానాన్ని ఆర్ట్ టీచర్ జి.శిరీష లత నేర్పించారు.

1 నుంచి బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కార్యక్రమాలు



జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో శ్రీనివాసమూర్తి

మహారాణిపేట: జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం శుక్రవారం జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్వో) శ్రీనివాసమూర్తి అధ్యక్షతన కలెక్టర్ సమావేశ మందిరంలో జరిగింది. జూన్ 1 నుంచి 30 వరకు చైల్డ్ లేబర్ వ్యవస్థ నిర్మూలన కోసం ప్రత్యేక తనిఖీలు నిర్వహించనున్నట్లు కార్మిక శాఖ జిల్లా అధికారి ఎం.సునీత తెలిపారు. 2025 నాటికి బాల కార్మికులు ఎవరూ ఉండకూడదనే నిబంధనతో ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. కార్మిక శాఖకు ఇతర శాఖల అధికారులు సహకారం అందించాలని కోరారు. అన్ని శాఖలు సమన్వయంతో ముందుకెళ్లి చైల్డ్ లేబర్ వ్యవస్థను రూపుమాపి బాలలకు విముక్తి కలిగించాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌డీవో పూర్ణిమ, ఏసీపీ వెంకటరావు, డీపీవో శరత్‌బాబు, చైల్డ్ వెల్‌ఫేర్ కమిటీ ప్రతినిధి రాధ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డ్రైడేతో దోమల నిర్మూలన



అక్కయ్యపాలెంలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది, చిన్నారులు



సీతంపేటలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మలేరియా విభాగం సిబ్బంది

సీతంపేట: వారానికి ఒక రోజు డ్రైడే పాటిస్తే డెంగ్యూ, మలేరియా వ్యాధులను వ్యాప్తి చేసే దోమల పెరుగుదలను అరికట్టవచ్చని జీవీఎంసీ మలేరియా విభాగం సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. ఫ్రైడే–డ్రైడే సందర్భంగా శుక్రవారం 25, 26 వార్డుల్లోని పలు ప్రాంతాల్లో మహిళలకు దోమలు పెరిగే ప్రదేశాలు, అవి పెరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించి కరపత్రాలు పంచారు. డెంగ్యూ, మలేరియాను వ్యాప్తి చేసే దోమలు నిల్వ ఉన్న నీటిలో పెరుగుతాయన్నారు. వారంలో ఒక రోజు నీటిని నిల్వ చేసే గోళాలు, డ్రమ్ములు, ట్యాంకులు, సంపులను శుభ్రం చేసి మళ్లీ నీరు పట్టుకోవాలని సూచించారు. నీటి నిల్వలపై మూతలు పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం తంబది, జీవీఎంసీ సిబ్బంది శివ పాల్గొన్నారు.

ప్రతీ గడపలో విశేష ఆదరణ



46వ వార్డులో అవ్వతో మాట్లాడుతున్న కె.కె.రాజు

కంచరపాలెం: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 46వ వార్డు కైలాసపురం, సంజీవయ్య కాలనీ–2, శాంతినగర్ ప్రాంతాల్లో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్‌తో కలిసి ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన తీరును అడిగి తెలుసుకుని, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ అందరికీ అండగా ఉంటూ అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను ప్రజలు విశ్వసిస్తున్నారన్నారు. 2024 ఎన్నికల్లో మళ్లీ ఆయనే సీఎం కావాలని గడప గడపలో ప్రజలు కోరుకోవడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో కో–ఆప్షన్ సభ్యుడు అప్పారావు, డైరెక్టర్లు శ్రీను, నూకరాజు, స్థానిక నాయకులు గోవింద్, దూది నరిసింగరావు, సోమునాయుడు, చిన్నారావు, దుర్గాభవాని, అప్పలరెడ్డి, రామారావు, ఈశ్వరరావు, రాజు, రమణారెడ్డి, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

సమాచారమ్

సెల్‌ఫోన్ పోయిందా.. 94906 17916కు మెసేజ్ చేయండి



క్రైం పోలీస్ స్టేషన్ వద్ద అతికించిన పోస్టర్

సీతమ్మధార: మీ విలువైన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నారా.. వెంటనే 94906 17916 వాట్సాప్ నంబర్‌కు హాయ్ అని మెసేజ్ చేయండి.. మేం ఎక్కడుందో కనిపెట్టి ఇస్తాం.. అని క్రైం పోలీసులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. నగర పోలీస్ కమిషనర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ ఆదేశాల మేరకు ప్రతి పోలీస్ స్టేషన్ వద్ద ఈ పోస్టర్లు వెలిశాయి. దీంతో సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వారికి కొంత మేలు జరుగుతోంది. పైన పేర్కొన్న వాట్సాప్ నంబర్‌కు హాయ్ అని మెసేజ్ చేస్తే.. వెంటనే మీకు మిస్సింగ్ మొబైల్ ఫ్రమ్ అని వస్తుంది. అందులో ఫిర్యాదు చేయండి.. లేదనుకుంటే ఇందులో పొందుపరిచిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయాలని ప్రకటించారు. దీంతో సెల్‌ఫోన్‌ను పోగొట్టుకుని పోలీస్ స్టేషన్‌కు వచ్చిన వారు పోస్టర్‌లోని నంబర్‌ను ఫోన్‌లో సేవ్ చేసుకుంటున్నారు. పోలీస్ కమిషనర్ మంచి నిర్ణయం తీసుకున్నారని పలువురు ప్రశంసిస్తున్నారు.